తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం 16 జనవరి 2025 | పేజీలు : 08



## లేక్ పార్కులో ప్రాణభయం

### మల్కాజిగిరిలో మేయర్ ఆదేశాలు ఉట్టివేనా?

- ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోరా!
- డిఈ మహేష్‌పై మండిపడుతున్న వాకర్స్

**మల్కాజిగిరి, జనవరి 15 (జనం సాక్షి):**
మల్కాజిగిరి సర్కిల్‌లోని సఫిల్‌గుడ లేక్ పార్క్ దుర్గంధం వెదజల్లుతుందని, పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటున్న స్థానికులు వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారని, సఫిల్ గుడ చెరువు సుందరీకరణ పనులు మొదలు పెట్టాలని డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ గత సంవత్సరం జూలై నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశాలలో మేయర్ దృష్టికి తీసుకువచ్చి సఫిల్గుడా చెరువును సందర్శించాలని మేయర్‌ను పట్టుపట్టడంతో జిహెచ్ఎంసి కమిషనర్‌తో కలిసి మేయర్ గద్వాల విజయలక్ష్మి చెరువును సందర్శించారు.



4

## కంట్రీమేడ్ గన్స్ విక్రయ
# ముఠా అరెస్ట్






**మల్కాజిగిరి, జనవరి 15 (జనం సాక్షి):**
ఆయుధాలను విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను జవహర్‌నగర్ పోలీసులతో కలిసి భువనగిరి ఎస్ఓటి పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ నుండి హైదరాబాదుకు కంట్రీమేడ్ గన్ సరఫరా చేస్తున్నారని పోలీసులకు విశ్వాసనీయ సమాచారం అందింది. జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ ప్రాంతంలోఅనుమానాస్పదంగా తిరుగుతు న్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరే కృష్ణ యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి మూడు కంట్రీమేడ్ గన్స్, ఒక తపాంచా, 10 రౌండ్ల బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాంపూర్ ప్రాంతంలో తయారైన ఈ ఆయుధాలను తక్కువ ధరకు కొని హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్మి సులువుగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఈ అక్రమ వ్యాపారంలోకి దిగాడని పోలీసులు వెల్లడించారు. ప్రధాన నిందితుడి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

## రంగవల్లులు సంస్కృతి
# సాంప్రదాయాలకు ప్రతీకలు

- ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు
- బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్ జనవరి 15 (జనంసాక్షి):**
మహిళలు వేసే ముగ్గులు మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మిగితా 4లో





# ప్రేమిస్తున్నాడని పెట్రోల్‌తో దాడి

- ప్రియుడి తండ్రి, 4 ఏళ్ళ చిన్నారిపై ఎగసిన మంటలు
- చిన్నారికి గాయాలు

**అల్వాల్, జనవరి 15 (జనంసాక్షి):**
అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎరుకల బస్తి, గోపాల్ నగర్, మచ్చబొల్లారంలో ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఘోర ఘటన చోటుచేసుకుంది. హేమలత, ప్రకాష్ అనే దంపతుల కొడుకు ప్రదీప్, వివేకానంద అనే వ్యక్తి అన్న కూతురు సాత్వికను ప్రేమిస్తున్నాడనే కారణంతో వివేకానంద కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో, 14 జనవరి 2025 రాత్రి సుమారు 8 గంటలకు వివేకానంద పెట్రోల్ తీసుకువచ్చి ప్రకాష్ తలపై, ఇంటి తలుపుపై పోసి నిప్పంటించాడు. ఈ దాడిలో ప్రకాష్ తీవ్రంగా గాయపడగా, మంటలు పక్కింటి దిలీప్ అనే వ్యక్తి నాలుగేళ్ల కుమార్తె చాందినిపై వ్యాపించాయి. చిన్నారి చాందినికి రెండు కాళ్లకు తీవ్రమైన గాయాలు కావడంతో తక్షణమే కొంపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రకాష్ గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అల్వాల్ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.



## మద్యం మత్తులో
## కొడుకు దాడి తండ్రి మృతి




4

## సంక్రాంతి
## రంగోలి.. నిరసన

ఇండస్ట్రియల్ కారిడార్ రైతులు



మిగితా మెయిన్‌లో

# క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపు పొందిన గోల్డెన్ ఈగల్ టీం

## రెండవ స్థానం నిల్చిన రైజింగ్ ఈగల్స్



**చౌడాపూర్ మండలం జనవరి 15( జనం సాక్షి):**
చౌడాపూర్ మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గత 5 రోజుల నుండి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం రోజు ఫైనల్ క్రికెట్ మ్యాచ్ లో గోల్డెన్ ఇగల్ నవీన్ టీం గెలుపు పొందడం జరిగింది. మొదటి బహుమతి నవీన్ టీం గెలుపు పోందాడం జరిగింది రెండవ బహుమతిగా రవి కుమార్ నిలిచారు. గెలిచినా వారికీ మొదటి బహుమతి దాతగా దాసు 12 వేలరూపాలు ఇవ్వడం జరిగింది. రెండవ బహుమతిగా ఉద్యోగస్తులు చంద్రకాంత్, అయూబ్, శ్రీను, నరేష్, భాస్కర్, ఇవ్వడం జరిగింది. గెలుపు పొందిన వారికి కప్స్ అందించిన కర్ణాకర్, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పోటీలలో పాల్గొన్న 6 టీం క్రీడాకారులను అభినందించా రు. గ్రామలలో నుంచి క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని,ఆదిశగా ప్రతి క్రీడాకారు డు కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ యూవత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలతోపాటు చదువుల్లో ఉత్తమ ప్రతిభను చూపాలని అన్నారు.నేటి పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా రాణించాలంటే ఆ రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.ముఖ్యంగా రోజు గంట సమయం పాటు నేటితరం యువత శారీరక శ్రమ,క్రీడలకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.గ్రామంలో గొప్పగా క్రీడల పోటీలో నిర్వహించడం సంతోషకరమని అన్నారు గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, కర్ణాకర్, దాసు, మాజీ ఉప సర్పంచ్ శివుడు, నీలియా నాయక్, ఉద్యోగస్తులు చంద్రకాంత్, అయూబ్, శ్రీను, నరేష్, భాస్కర్, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు వెంకటేష్, శరత్, పత్రిక మిత్రుడు అశోక్, నసీర్, రామకృష్ణ మందిపాల్ మహేష్, రాజేష్, పాండు, గోపాల్, క్రీడాకారులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం కన్హా శాంతి వనం





- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి
- లక్ష మంది ఏక కాలంలో ధ్యానం చేసే ప్రకృతి ఒడి కేంద్రం
- కన్హా శాంతి వనాన్ని సందర్శించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 15 (జనంసాక్షి):**
కన్హా శాంతి వనం గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం అని, మానసిక ప్రశాంతతకు నిలయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి అన్నారు.బుధవారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరు గ్రామంలోని కన్హా శాంతి వనాన్ని చిన్నారెడ్డి సందర్శించారు. వేయి ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న కన్హా శాంతి వనాన్ని కలియ తిరిగి ప్రకృతి అందాలను ఆస్వాదించారు.కన్హా శాంతి వనంలో ఏక కాలంలో ఒక లక్ష మంది ధ్యానం చేసుకునే మందిరాలు నిర్మించడం, విద్యా, వైద్యం వంటి సౌకర్యాలు ఉండటం చూసి చిన్నారెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు.దైనందిన జీవితంలో మనిషి వివిధ అంశాలపై ఒత్తిడికి గురవుతున్నారని, ఇలాంటి సమయంలో కన్హా శాంతి వనంలో సాంత్వన లభిస్తుంది అని చిన్నారెడ్డి పేర్కొన్నారు.ధ్యానం, యోగాలను భారత దేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరాలు అని చిన్నారెడ్డి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు, దేశంలోని అనేక రాష్ట్రాలకు చెందిన ప్రజలు కన్హా శాంతి వనంలో సాంత్వన పొందుతున్నారని, వారికి వేదికను అందించిన రామచంద్ర మిషన్ సంస్థ చైర్మన్ కమలేష్ డీ పటేల్ కు చిన్నారెడ్డి అభినందనలు తెలిపారు. కన్హా శాంతి వనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు.



## ప్రాణాపాయ స్థితిలో ఉన్న పసి పాపకి

# రక్తదానం చేసిన యువశక్తి ఫౌండేషన్

### ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎక్కడ దొరకని అరుదుగా దొరికే ఎబి నెగటివ్

### అర్ధరాత్రి 12గం రక్తదానం చేసిన ఫౌండేషన్ మెంబెర్ డా. మహేష్

**కొడంగల్ ,జనవరి 14 (జనం సాక్షి) :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్న బాబు ప్రాణాన్ని రక్షించేందుకు యువశక్తి ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు మాట్లాడుతూ బాబు అనారోగ్య రీత్యా జిల్లా గవర్నమెంట్ హాస్పటల్ లో అడ్మిట్ చేశారు అని ఫౌండేషన్ నిర్వాహకులు కాగితాల మధు తెలిపారు.వికారాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వెంకటయ్య కుమారుడు పాలమూరు హాస్పటల్ లో అడ్మిట్ చేయడం జరిగింది. అనంతరం పరీక్షించిన వైద్యులు రక్తం తక్కువ ఉంది. వెంటనే బి నెగటివ్ బ్లడ్ ఎక్కించాలి అని చెప్పడంతో బ్లడ్ కోసం కోసం ఉమ్మడి పాలమూరు జిల్లా బ్లడ్ బ్యాంకులలో మొత్తం వెతికిన దొరకకపోవడం తో కుటుంబ సభ్యులు ఆందోళనలో పడ్డారు. యువశక్తి ఫౌండేషన్ అండగా ఉంటుందనే విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్‌ని ఆశ్రయించినట్లు ఫౌండేషన్ చైర్మన్ కాగితాల మధు తెలిపారు. పసిపాప ప్రాణాల్ని కాపాడాల ని నిర్ణయించుకున్న మధు వెంటనే ఫౌండేషన్ మెంబెర్ డాక్టర్ మహేష్ బాబుతో రక్త దానం చేసి గర్భిణీ స్త్రీకి అండగా నిలబడ్డారు. అదేవిధంగా ఆపదలో ఉన్నవారి కి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలని యువతకు పిలుపునిచ్చారు.కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు, డాక్టర్ మహేష్, శివకుమార్, రామకృష్ణ,శ్రీకాంత్, యాదయ్య పాల్గొన్నారు.

## తోటి స్నేహితుడికి బాసటగా నిలిచిన భాగ్యమిత్రులు



**కుల్కచర్ల, జనవరి 15 (జనం సాక్షి):** అనారోగ్యంతో బాధపడుతున్న తోటి స్నేహితుడికి బాసటగా నిలిచిన భాగ్యమిత్రులు. పూర్తి వివరాలు.. కుల్కచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన సిసి వెంకటయ్య మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేశారు. తనతో చదువుకున్న పూర్వపు విద్యార్థులు మానవత్వం తో మేమున్నామంటూ ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని రూ.52,000 వేలు ఆర్థిక సాయం బుధవారం వెంకటయ్యకు అందజేసి శభాష్ అనిపించుకున్నారు.అనంతరం వెంకటయ్య కుటుంబ సభ్యులు మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సి కృష్ణయ్య, మాలే రామస్వామి,సి శ్రీను, కే శేఖర్, ఎం రమేష్, జై నర్సింలు, వెంకటయ్య, చందర్ పాల్గొన్నారు.

# సంక్రాంతి తెలుగు వాళ్లకు ఎంతో ప్రత్యేకం

## పిఏసి చైర్మన్ అరికెపూడి



**శేరిలింగంపల్లి, జనవరి 15 (జనంసాక్షి) :**
భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను ఇనుమడింపజేసుకున్న సంక్రాంతి మహా పర్వదినం తెలుగు ప్రజలకు ఎంతో ప్రత్యేకమైనదని, ఇక్కడ నిర్వహించుకున్నం త ఘనంగా దేశంలో మరెక్కడా సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకోరని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు సంక్రాంతి పండుగలో భాగమైన కనుమ రోజున బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి శేరిలింగంపల్లి గచ్చిబౌలి డివిజన్ పరిధి గుల్ మోహర్ పార్క్ లో సంక్రాంతి సంబరాలలో పాల్గొన్నారు. కనుమను పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి కాసేపు సేద తీరడం జరిగిందని, పార్కులు ఆహ్లాదకరంగా, చిన్న పిల్లలు ఆడుకోవడానికి అనువుగా తీర్చిద్దిద్దడం జరిగిందన్నారు. పార్క్ లో కుందేళ్లు, బాతులు, కోళ్లు అన్ని రకాల పక్షులు ఉన్నాయని, అన్ని రకాల మొక్కలు ఒకే ప్రాంతంలో ఉండి ప్రజలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులో ఉండడం హర్షించదగ్గ విషయం అన్నారు. గుల్ మోహర్ పార్క్ కాలనీకి జాతీయ స్థాయిలో అవార్డు రావడం చాలాసంతోషకరమైన విషయమని, ఇది శేరిలింగంపల్లి వాసులుగా గర్వించదగ్గ విషయమన్నారు. గుల్మోహర్ పార్కును జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేలా కృషి చేసిన కాలనీ అసోసియేషన్ ప్రతినిధులను, కాలనీ వాసులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందిస్తున్నానని పిఏసి చైర్మన్ అన్నారు. పార్క్ లో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో పల్లెటూరి వాతావరణంతో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనతో ప్రజలందరికి ఆహ్లాదం పంచుతుందని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో గుల్ మోహర్ కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ ఖాసీం, గాంధీ మనవడు ఆర్య వీర్, మనవరాలు అన్య, నాయకులు కావూరి అనిల్, పోతుల రాజేందర్, కాశినాథ్ యాదవ్, అనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ళు రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియ షురూ






**రాజేంద్రనగర్, జనవరి 15 (జనం సాక్షి) :**
రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి పరిధిలోని రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని రాజేంద్రనగర్ జిహెచ్ ఎంసి ఉప కమిషనర్ కె. రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం జోనల్ కమిషనర్, చార్మినార్ జోన్ సూచనల మేరకు, రాజేంద్ర నగర్ సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ బృంద సభ్యులతో రేషన్ కార్డ్ డేటా వెరిఫికేషన్ కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల జాబితా ప్రింట్ కాపీని సక్రమంగా కేటాయి ంచి, దానికి సంబంధించిన ప్రొసీడింగ్‌లను జారీ చేసి, గురువారం 16 నుండి వెరిఫికేషన్ పనిని ప్రారంభించి, 21 జనవరి 2025 నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

మణికొండ మున్సిపాలిటీలో... రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులతో నూతన రేషన్ కార్డు వెరిఫికేషన్ ప్రక్రియను విజయవంతంగా కొనసాగించా లని మణికొండ పురపాలక సంఘం లో చైర్మన్ కస్తూరి నరేందర్ అధ్యక్షత కమీషనర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో రేషన్ కార్డు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై సమావేశం నిర్వహించారు. రేపటి నుండి వార్డుల వారీగా డేటా వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించి, ఈనెల 21 వరకు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

బీజేఎంసీలో... రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు లబ్దిదారుల సర్వే గురించి మద్దెల లత అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ కార్యాలయం కాన్సిల్ సమావేశం నిర్వహించారు.

కమీషనర్ శరత్ చంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు వివరించారు. వార్డు అధికారి, ఫీల్డ్ వెరిఫికేషన్ అధికారులు అన్ని నియమనిబంధనలు తెలుసుకొని తప్పులు లేకుండా సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ సెక్షన్ ల అధికారులు, సూపర్ వైజర్ ఆఫీసర్లు వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి రంగోలి

## ఇండస్ట్రియల్ కారిడార్ రైతుల వినూత్న నిరసన





**బొంరాస్ పేట, జనవరి 15 (జనంసాక్షి):** దుద్యాల మండలం రోటిబండ తండా గ్రామపంచాయతీలో ఇండస్ట్రియల్ కారిడార్ బాధిత కుటుంబ సభ్యులు సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రంగురంగుల రంగోలితో అందమైన ముగ్గు వేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, లగచర్ల,రోటిబండ తండా, పులిచర్లకుంట తండా, హకీంపేట్ ,పోలేపల్లి గ్రామాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం జరుగుతుందన్న భూసేకరణ ఆపివేయాలని ముగ్గులు వేసి నిరసన తెలిపారు.

## బొంరాస్‌పేట మండలంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు






**బొంరాస్ పేట, జనవరి 15(జనంసాక్షి):** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సంక్రాంతి సంబరాలు ప్రజలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం నుండి మహిళలు పెద్ద ఎత్తున అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పేర్చి పాలు పొంగించారు. పలు గ్రామాల్లో గంగిరెద్దులు డూడు బసవన్న ఆటలు అందరిని ఆకట్టుకున్నాయి. బుధవారం కనుమ సంక్రాంతిని పురస్కరించుకొని ప్రజలు కర్రీ పండుగను నిర్వహించుకున్నారు. మటన్ చికెన్ షాపులకు జనాలు పోటెత్తారు. మటన్ కేజీ రూ.700 నుండి 800 వరకు, చికెన్ కేజీ రూ.230 నుండి 260 వరకు ధర పలికింది. పట్టణాల నుండి గ్రామాలకు బంధుమిత్రులు స్నేహితులు సన్నిహితులు రావడంతో పల్లెలు సందడిగా మారాయి.

## పోలేపల్లి క్రికెట్ టోర్నమెంట్ విజేత లగాన్ జట్టు



**బొంరాస్‌పేట, జనవరి 15 (జనంసాక్షి):** దుద్యాల్ మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో భాగంగా మంగళవారం ఫైనల్‌లో లగాన్ ,శివాజీ సేన జట్లు పోటీ పడదా లగాన్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్ జట్టుకు రూ. 5000 రన్నర్ జట్టుకు రూ. 2500 స్పాన్సర్ పుర్రా రాఘవేందర్ అందజేశారు.

## చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నజ్దిక్ సింగారంలో వైభవంగా సంక్రాంతి ఉత్సవాలు









**యాచారం, జనవరి 15 (జనంసాక్షి) :** యాచారం మండల పరిధిలోని నజ్దిక్ సింగారం గ్రామంలో చైతన్య యూత్ క్లబ్ అధ్యక్షుడు వన్నవాడ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని అనపడుచులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వలన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడబడతాయని,కుటుంబ విలువలు పెంపొదుతాయని కొనియాడారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు ముఖ్యఅతిథి,మరియు గ్రామ మహిళా ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అందజేసారు .కార్యక్రమంలో చైతన్య యూత్ క్లబ్ సీనియర్ సభ్యులు చింతపల్లి బాల్ రెడ్డి,శ్రీనివాస్ చారి, వన్నవాడ లక్ష్మారెడ్డి, ఆదిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,రాజేందర్ రెడ్డి,వన్నవాడ సాయిరెడ్డి, శివారెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, శేఖర్ రెడ్డి , గోవర్ధన్ రెడ్డి ,రాజీవన్ రెడ్డి ,రాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**రాజేంద్రనగర్,జనవరి15,(జనంసాక్షి):** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించుకోవడం హర్షించ దగ్గ విషయమని రాష్ట్ర కురుమ సంఘం నాయకుడు బండ సూరి పేర్కొన్నారు. కార్పొరేషన్ సంఘం క్యాలెండర్‌ను మంగళవారం రాత్రి సంధ్యా నగర్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండ్లగూడ కార్పొరేషన్ కురుమ సంఘం అభివృద్ధి కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తో తెలియజేశారు. కురుమల అభ్యున్నతికి సంఘం ఆధ్వర్యంలో సంఘసేవ,సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్పొరేషన్ సంఘ అధ్యక్షుడు తాండ్ర రమేష్ కుమార్ ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మణులు మాట్లాడుతూ కులస్తులంతా సమిష్టి కృషితో క్యాలెండర్ ను రూపొందించి ఆవిష్కరించుకున్నట్టు వెల్లడించారు. నూతన సంవత్సర క్యాలెండర్ను ప్రతి కుల సోదరునికి అందజేస్తామన్నారు. ప్రతి కులస్తుడు తమ ఇంట్లో తప్పనిసరిగా క్యాలెండర్ను ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఆర మైసమ్మ దేవాలయ నిర్మాణ దాత బండ సూరిని కులస్తులు అంతా కలిసి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, కుల సోదరులు పాల్గొన్నారు.

## వీడియో జర్నలిస్ట్ తంగలపల్లి నాగరాజు హఠాన్మరణం



**అల్వాల్ జనవరి 15(జనంసాక్షి):** అల్వాల్ వీడియో జర్నలిస్ట్ తంగలపల్లి నాగరాజు(42) గుండెపోటుతో మరణించారు. నాగరాజు మృతి పట్ల తోటి జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా మా తెలంగాణ టివి ఛానల్‌లో వీడియో జర్నలిస్ట్‌గా పని చేస్తున్నారు. నాగరాజుకు భార్య రాజ్యలక్ష్మి,కు బద్రినాథ్, కూతురు నవ్యశ్రీ ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న నాగరాజు మృతితో ఆ కుటుంబం అనాథగా మారింది. ప్రభుత్వము, జర్నలి స్టు సంఘాలు నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి కృష్ణ



తలకొండపల్లి జనవరి15(జనంసాక్షి):నిరుపేదలకు ఎలాంటి ఆపద వచ్చినా అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి కృష్ణ అన్నారు.తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన చిల్కం లక్ష్మయ్య అనే వ్యక్తి గత కొన్ని రోజుల క్రితం అకాల మరణం చెందారు.వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించిన గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి కృష్ణ మంగళవారం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.తన వంతు సహాయంగా కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యాన్ని,1000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కృష్ణా రెడ్డి,మాజీ సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ తిక్కల వెంకటయ్య,శ్రావణ్ కుమార్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,శ్రీను,శివ, వెంకటేష్,కాకిశివ,హరీష్,సురేష్,రాము,పర్వతాలు,మల్లేష్,తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల వైపు మొగ్గు స్వయంకృషితో గ్రామ టర్నమెంట్



**బషీరాబాద్,జనవరి 15 (జనంసాక్షి) :** బషీరాబాద్ మండల పరిధిలో అల్లా పూర్ (బి) గ్రామంలో యువకుల అధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా అల్లా పూర్ (బి) గ్రామంలో యువకుల అధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా అల్లా పూర్ ప్రీమియర్ లీగ్ పేరుతో యువకులు క్రీకెట్ ఆట్టను ఎంచుకోన్ని రెండు రోజుల పాటు ఐదు ట్టిములుగా ఏర్పడి ఒక్క టీం రెండు మ్యాచులు అడి ఇందులో ఫైనల్ కు సిద్ధార్థ,బన్నీ టీములు చేరుకొని సిద్దార్థ,బన్నీ టీములు పోటా పోటీతో ఆడి ఫైనల్ సిద్ధార్థ టీం విన్నర్,బన్నీ టీం రాన్నర్‌గా గెలుపొందారు.గెలుపొందిన వారికి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో యువకులు రాములు,శివ,వీరయ్య స్వామి,వెంకటేష్,బస్వరాజు,రాజు గౌడ్,హరిక్రిష్ణ, నవేగ్ష్,శ్రీనివాస్,అజయ్,ప్రవీణ్,మహేష్,బన్నీ,అరుణ్,రాకేష్,రాఘుపతి,శ్రీకాంత్ గౌడ్, నవీన్,శివ గౌడ్, లడ్డూ,హరివర్ధన్ గౌడ్,పాల్గొన్నారు.

## ఊరూరా ఘనంగా సంక్రాంతి కనుమ వేడుకలు



చేవెళ్ల,(జనంసాక్షి): సంక్రాంతి పండుగను ఊరూరా ఘనంగా నిర్వహించారు. మంగళవారం, బుధవారం సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. మహిళలు ఉదయమే లేచి వాకిళ్లలో కళ్లాపి చల్లి రంగు రంగులు ముగ్గులు వేసి ప్రతి తెలుగు లోగిళ్లలో పండుగ శోభ సంతరించుకుంది. పండుగ సందర్భంగా చేవెళ్ల మండల గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. చేవెళ్లలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. యువకులు గాలిపటాలు ఎగురవేస్తూ సంతోషంగా గడిపారు. గ్రామాల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో యువతకు కబడ్డీ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుని ప్రత్యేకపూజలు చేశారు.



# మద్యం మత్తులో కొడుకు దాడి తండ్రి మృతి

**శామీర్ పేట (జనం సాక్షి ) :** రోకలి బండతో కొడుకు దాడి చేయగా తండ్రి మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రం శామీర్ పేట పెద్దమ్మ కాలనీలో హనుమంతు తన కుటుంబ సభ్యులతో నివాసముం టున్నాడు. మంగళవారం తల్లి కూతుళ్లు చీర విషయంలో గొడవ పడుతుండగా చేపల అక్వేరియం తగిలి కింద పడింది. దీంతో నరసింహ మద్యం మత్తులో తల్లిపై దాడి చేస్తుండగా తండ్రి హను మంతు (50)అడ్డుకోపోయాడు. నరసింహ అడ్డు వచ్చిన తండ్రిని రోకలి బండతో కొట్టగా దెబ్బలకు తట్టుకోలేక పారిపోతుండ గా పట్టుకొని ఇటుక రాయితో గట్టిగా మోదాడు. హనుమంతు తీవ్ర రక్తస్రావంతో కింద పడిపోయాడు. హనుమంతు కూతురు 108 వాహనానికి ఫోన్ చేయగా సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది హనుమంతును పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి కూతుర్లు శామీర్ పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**తండ్రిని హత్య చేసిన కొడుకు రిమాండ్....**

మండల కేంద్రం శామీర్ పేట పెద్దమ్మ కాలనీలో నివాసముంటున్న హనుమంతును మద్యం మత్తులో తన కొడుకు నరసింహ(28) రోకలిబండతో మోడీ హత్య చేశాడు. నరసింహ డ్రైవర్ పని, కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. వచ్చిన డబ్బులతో నరసింహ నిత్యం మద్యం సేవించి మద్యం మత్తులో ఇంట్లో గొడవ పడేవాడు. దీంతో తన భార్య నరసింహను వదిలేసి వెళ్లిపోయింది. కాగా తండ్రిని హత్య చేసిన నరసింహపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయగా శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో నర్సింహను అదుపులోకి తీసుకొని బుధవారం విచారణ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## పోలీస్ స్టేషన్‌కు హాజరైన మాజీ ఎమ్మెల్యే పట్నం

**బొంరాస్ పేట, జనవరి 15 (జనం సాక్షి):** దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్ బృందంపై జరిగిన దాడి కేసులో నిందితుడైన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బుధవారం బొంరాస్ పేట పోలీస్ స్టేషన్ కు హాజరై సంతకం పెట్టారు. కేసులో ఏ1గా ఉన్న ఆయన బెయిల్ పై విడుదలయ్యారు. ప్రతి బుధవారం పోలీస్ స్టేషన్ కు హాజరై సంతకం పెట్టాలని కోర్టు ఆదేశించడంతో హాజరయ్యారు. అనంతరం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోట్ల యాదగిరి ఆధ్వర్యంలో పలువురు నాయకులు పార్టీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని కలిసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడంగల్ మండల అధ్యక్షులు దామోదర్ రెడ్డి, పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి ,సుదర్శన్ రెడ్డి, నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఘనంగా ప్రజా నాయకుని జన్మదిన వేడుకలు

- **రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన సంబరాలు**



**తలకొండపల్లి జనవరి15(జనంసాక్షి):** తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన పురస్కరించుకుని మంగళవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో అభిమానులు బీఆర్ ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఉప్పల వెంకటేష్ భారీ కటౌట్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తయారు చేయించిన కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతూ,పేద ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చిన నేనున్నానంటూ అండగా నిలుస్తూ ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రజలకు ఎన్నో సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు.వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని,ప్రజలకు మరింత ఉన్నతమైన సేవలను అందించాలని కోరారు.అనంతరం ప్రజలకు అరటిపండ్లను పంచిపెట్టారు.ఉప్పల వెంకటేష్ జన్మదిన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అభిమానులు నాయకులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్,మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ,మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కుమ్మరి శంకర్,మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య,జగతయ్య గుప్తా,మాజీ సర్పంచ్ గోపాల్,సింగల్ విండో డైరెక్టర్ కటికల శేఖర్,మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఇమ్రాన్,శ్రీశైలం యాదవ్,కోర్ర కృష్ణ నాయక్,సింగర్ దర్వుల రాజ్ కుమార్,పబ్బ సంపత్,పోతుగంటి మల్లేష్, డాక్టర్ రవి, పాండు, తుడుం కిరణ్, అభిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**తలకొండపల్లి జనవరి15(జనంసాక్షి):** మకర సంక్రాంతి సందర్భంగా తన జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మంజుల, అఖిల్, అనిల్ కుటుంబసభ్యులతో కలిసి మంగళ వారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి,మొక్కులు చెల్లించుకున్నారు.రాష్ట్ర ప్రజలు, కల్వకుర్తి నియోజక వర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని,అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని శ్రీవారిని కోరినట్లు రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తెలిపారు. అలాగే తన జన్మదినం సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అభిమా నులు, నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరూ తన జన్మదినం ఘనంగా నిర్వహించినందున ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# లేక్‌పార్క్‌లో ప్రాణభయం



పార్క్ అంటే ఇలా ఉంటదా అని అధికారులపై మండిపడింది, డిఈ మహేష్ ను పిలిచి 15 రోజులలో పార్కు ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, పాత ఆట వస్తువులు, పనికిరాని ఓపెన్ జిమ్ పరికరాలు తొలగించి కొత్తవి మార్చాలని దీనికి వెంటనే నిధులు మంజూరు చేస్తున్నామని అధికారులకు తెలిపారు. మేయర్ ఆదేశించిన నెలరోజుల తర్వాత పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ అక్కడక్కడ వాకింగ్ ట్రాక్ బండలు తవ్వి వదిలేసాడు, దీంతో ప్రతిరోజు వాకింగ్ చేసే వారు నడవలేక కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు, చిన్నారులు ఆడుకునే ఆట వస్తువులు తుప్పు పట్టి విరిగిపోయాయి, ఒక చిన్న బాబు దాని పైనుంచి జారీ ఐదు అడుగుల పైనుండి కింద పడడంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాత్రూంలు ముక్కుపుటాలు అదిరే వాసన రావడంతో పార్కును సందర్శించే వారు బాత్రూంలోకి వెళ్లలేక పార్కులోనే మూత్ర విసర్జన చేస్తున్నారు.స్ట్రీట్ లైట్లు వెలగక,గేట్లు లేక పోవడంతో చీకటి పడగానే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది.15 రోజులలో పార్కును అభివృద్ధి చేయాలని గత సంవత్సరం జూలై నెలలో మేయర్ ఆదేశించిన అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఎక్కడపడితే అక్కడ తవ్వి వదిలేశారని వాకర్స్ వాపోతున్నారు. మేయర్ ఆదేశించిన ఏ ఒక్క పని కూడా పార్కులో జరగలేదని అధికారులపై మండిపడుతున్నారు. అధికారులు నిద్రమత్తు వీడి పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

# రంగవల్లులు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలు





అన్నారు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫరూక్ నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో భగత్ సింగ్ యూత్ గౌరవ అధ్యక్షులు బుడ్డ నరసింహ ఆధ్వర్యంలో 15వ సంవత్సరాలుగా సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించరు ఈ పోటీలలో గ్రామ మహిళలందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారని ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ సంక్రాంతి పండుగకు కొత్త కాంతిని తెస్తుందని అన్నారు నిరుపేదల జీవితాలలో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారన్నరు ఎలికట్ట గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎలికట్ట గ్రామం నుండి సర్దార్ నగర్ వరకు రోడ్డు అభివృద్ధి చేయడం జరిగిందని గ్రామానికి నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయించడం జరిగిందన్నారు పరిగి రోడ్డు నుండి భవానీ మాత దేవాలయం వరకు రోడ్డును డబుల్ రోడ్డు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు ప్రభుత్వం అందిస్తున్న పథకాల కోసం ఎవరి వద్ద చేయి చాచాల్సిన అవసరం లేదనిఅధికారులు ప్రజాప్రతినిధులు మీ ఇంటికే వచ్చి మీకు సంక్షేమ పథకాలను అందజేస్తారని స్పష్టం చేశారు అభివృద్ధి పథకాల అమలులో ఎవరి పెత్తనం ఉండదని పథకాల అమలు పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు. పాతతరం నాటి సాంప్రదాయాలను కాపాడుకోవాలనే ఆలోచనతో భగత్ సింగ్ యూత్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు.భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని యూత్ సభ్యులకు సూచించారు. అనంతరం ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులను అందజేశారు మొదటి బహుమతిగా బంగారం రెండో బహుమతిగా వెండి మూడవ బహుమతిగా వెండి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతులమీదుగా భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో అందజేశారు నాల్గవ బహుమతిగా వెయ్యి రూపాయలు ముగ్గుల పోటీలో గెలిచినా మిగతా వారికి ఐదు వందల రూపాయలు చొప్పున

నగదు అందజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి చల్లా శ్రీకాంత్ రెడ్డి బాల్ రాజు గౌడ్ మంగులాల్ నాయక్ నాగమణి చంద్రకళ అరుణ తుపాకుల శేఖర్ రాయికల్ శ్రీనివాస్ సీతారాం ముబారక్ అలిఖాన్ లింగారెడ్డిగూడ అశోక్ అంజి యాదవ్, ముత్యాల రాజు నారం దినేష్ రెడ్డి బద్దుల మల్లయ్య యాదవ్ కావలి శ్రీశైలం బెంది మోహన్ రెడ్డి చాకలి చంద్రయ్య నారాయణ్ రెడ్డి రాంరెడ్డి నారం శ్రీపాదరెడ్డి వార్ల యాదయ్య బోయినపల్లి బాల్ రత్నం గౌడ్ బోయినిపల్లి ఆంజనేయులు గౌడ్ శివ యూసుఫ్ ఎండి ఆజం రాజు బోనయ్య అంబటి శేఖర్ గడ్డమీది శ్రీను జంపుల సింహ నరేష్ కిరణ్ అజయ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు..

# క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

- వెల్జాల్‌లో ముగిసిన క్రికెట్ పోటీలు
- హాజరైన మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్

**తలకొండపల్లి జనవరి15(జనంసాక్షి):**
క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా గత ఐదు రోజులుగా నిర్వహించిన వెల్జాల్ ప్రీమియర్ లీగ్- 11(క్రికెట్) పోటీలు 11స్టార్స్ టీమ్ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిశాయి.గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటుచేసిన బహుమతుల ప్రధాన ఉత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్,ముఖ్య అతిథులుగా హాజరై విజయం సాధించిన జట్లకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగకి గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.సంక్రాంతి అంటే అందరూ ఆంధ్రప్రదేశ్ వెళ్లి పోతారు,కానీ మన గ్రామంలో నిర్వహించిన వెల్జాల్ ప్రీమియర్ లీ క్రికెట్ పోటీలు చూడడానికి హైదరాబాద్ నుండి మన గ్రామం,పెద్దలు,యువకులు,క్రికెట్ చూడడానికి రావడం సంతోషంగా వుంది.గ్రామంలోని యువత క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించి,రోజు ప్రాక్టీస్ చేయాలని,కేవలం పండగల సందర్భంగానే ఆడితే ఆటల్లో విజయం సాధించడం కష్టమని అన్నారు.ప్రతి సంవత్సరం నిర్వహించే సంక్రాంతి పండగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌కు మా వంతుగా మొదటి బహుమతి రూ,15,వేలు మరియు మా నాన్న కీర్తిశేషులు సి.జంగయ్య యాదవ్ (రిటైర్డ్ హెడ్మాస్టర్) ఆయన జ్ఞాపకార్థంగా కప్పులు,షీల్డ్ లు బహుమతి ఇవ్వడం ఆనందం వ్యక్తం చేశారు.నా వంతుగా క్రీడాకారులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.ద్వితీయ బహుమతి మాజీ ఉపసర్పంచ్ అజీజ్ తమవంతుగా రూ,10,వేలు అందజేశారు. క్రీడాకారులకు టీ షర్ట్స్ అందించిన (వి.ఎస్.ఆర్ కన్ స్ట్రక్షన్) అధినేత వనరాశి వెంకటేష్ మాట్లాడుతూ వెల్జాల్ గ్రామంలో సుమారు 200 మంది వరకు క్రీడాకారులు క్రికెట్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని,



క్రీడలతో పాటు చదువుపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.మొదటి బహుమతి సాధించిన వెల్జాల్ ఇండియన్స్ టీం వెల్జాల్ ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు సిహెచ్ విష్ణువర్ధన్ యాదవ్ టీమ్,కు రూ,15,వేలు నగదును అందించారు.రెండో స్థానంలో నిలిచిన వెల్జాల్ రైడర్స్ టీమ్,కు ఉప సర్పంచ్ అజీజ్ రూ,10,వేల నగదును అందించారు.అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్,మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఎంపికైన క్రీడాకారులకు అందజేశారు.ప్రతిరోజు నిర్వహించిన పోటీలలో విజయం సాధించిన జట్లకు మ్యాన్ ఆఫ్ మ్యాచ్ కింద షీల్డ్ లు అందజేశారు.వెల్జాల్ ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్ యాదవ్ మాట్లాడుతూ,ఈ టోర్నమెంట్,లో మా జట్టు గెలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన 11 స్టార్స్ టీమ్ ఆర్గనైజర్స్‌గా నిర్వహించడం సంతోషం వ్యక్తం చేశారు.క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం మన గ్రామంలో సంక్రాంతి పండగ కు యువకులంతా గ్రామానికి వస్తారు.యువకులందరూ క్రీడలు ఒక్కటే ముఖ్యం కాకుండా జీవితంలో స్థిరపడడానికి మంచి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ కూన రవికుమార్,మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు ముజేబర్ రహమాన్, ఏఎంసీ డైరెక్టర్ చెర్ల వెంకటరెడ్డి,మాజీ ఎంపిటిసి అంబాజీ,మాజీ ఉపసర్పంచ్ అజీజ్,(వి.పీ.ఎల్)వ్యవస్థాపకుడు సి.హెచ్.విష్ణువర్ధన్ యాదవ్,వి.ఎస్.ఆర్ బిల్డర్ వానరాశి వెంకటేష్, గోపాలకృష్ణ, విజయ్‌కుమార్, అబ్బాస్, స్వామి, ఆరిఫ్, శ్రీను, శ్రీరామ్, ఖయ్యూ, శేఖర్, విజయ్‌కుమార్, గౌస్, సుధాకర్, రాఘవేందర్, ప్రసాద్, శ్రీనివాసులు, రాము ,శ్రీశైలం శివ, ఆంజనేయులు, విష్ణు, వేణు, గణేష్, క్రీడాకారులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పత్రిక జనంసాక్షి

- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ ఎమిరెడ్డి భగవాన్ రెడ్డి
- మాజీ సర్పంచ్ ధ్యాసమోని చంద్రయ్య
- పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ భూపాల్ రెడ్డి, వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్ అజీజ్



**తలకొండపల్లి జనవరి15(జనంసాక్షి):**
ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పత్రిక జనంసాక్షి జాతీయ తెలుగు దినపత్రిక అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఏమిరెడ్డి భగవాన్ రెడ్డి,మాజీ సర్పంచ్ ధ్యాసమోని చంద్రయ్య,పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ తడిసిన భూపాల్ రెడ్డి,వెల్జాల్ మాజీ సర్పంచ్ అజీజ్,లు పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చౌదర్ పల్లి,వెల్జాల్ గ్రామంలో భగవాన్ రెడ్డి,చంద్రయ్య,భూపాల్ రెడ్డి,అజీజ్,ల చేతుల మీదుగా మంగళవారం 2025 జనంసాక్షి జాతీయ తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్,ను తలకొండ పల్లి జనంసాక్షి విలేఖరి తూర్పు శ్రీను ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పత్రిక జనంసాక్షి పత్రిక అని, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజలకు పత్రికలు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు.మీడియా ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడాలని ప్రజా అవసరాలను గుర్తించి పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గానికి కృషి చేయాలన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్,ను ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డిప్యూటీ తహసిల్దార్ హరేందర్ రెడ్డి, ఇంటలిజెంట్ ఎస్సై ఖయ్యూం,రైల్వే డిపార్ట్మెంట్ ఆఫీసర్ ప్రసాద్ గౌడ్,రిటైర్డ్ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఐలయ్య,తడిసిన నరేష్ రెడ్డి,రవి కిరణ్ రెడ్డి,మాజీ ఎంపిటిసి మాద్గుల పెంటమ్మ రామస్వామి,మాజీ ఉపసర్పంచులు బీసా శ్రీనివాస్ రెడ్డి,ఎన్టీ రామారావు,ప్రభాకర్ రెడ్డి,అర్జున్ రెడ్డి,బహుగుణ రెడ్డి,జలగం శ్రీశైలం,ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ, సిఆర్పి మల్లేష్,రాఘవేందర్ రెడ్డి,విక్రమ్ రెడ్డి, నరేందర్(గుట్టల్) ఆరిఫ్, శ్రీనివాసులు, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- ఈనెల 26 నుంచి రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్లు కొత్త రేషన్ కార్డులు పథకాల అమలు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 15 (జనం సాక్షి) :**
ప్రభుత్వ పథకాలను క్షే త్ర స్థాయి లో అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ అన్నారు,రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండిప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుకు అధికారులు పూర్తి బాధ్యత పని చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు,షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి,గ్రామ సభల ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని తహసీల్దార్ లకు, అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాలు నుండి తహసీల్దార్‌లకు, అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్ల పథకాల ముఖ్య ఉద్దేశాలు,విధి విధానాలు క్షేత్ర స్థాయి పరిశీలన,గ్రామ సభలు నిర్వహణ, లబ్ధిదారుల ఎంపిక తదితర విషయాలపై వివరించారు ఈ నెల 26( గణతంత్ర దినోత్సవం)న ప్రభుత్వం పేదల కోసం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రారంభించబోతోందని, ఇందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నాలుగు పథకాల అమలుపై జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన, గ్రామ సభల నిర్వహణ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు వెంటనే సన్నాహాలు చేసుకోవాలని మండల నోడల్ అధికారులను, ఆదేశించారు. గ్రామ స్థాయిలో టీమ్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేయాలని అన్నారు.క్షేత్ర స్థాయి పరిశీలన లో ప్రభుత్వ నిబంధనల ననుసరించి ఎంపిక చేసిన అర్హులైన ముసాయిదా జాబితా ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించనున్న గ్రామ,వార్డ్ సభలలో చదివి వినిపించి అర్హుల జాబితా తయారు చేయాలని ,గ్రామ సభలలో అభ్యంతరాలు ఉంటే స్వీకరించి 10 రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశించారు.
ఈ నెల 21 నుండి 25 వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామసభలలో ఇందిరమ్మ కమిటీలను భాగస్వామం చేయాలని చెప్పారు.

**రైతు భరోసా**



రైతు భరోసా సహాయం ఎకరాకు రూ.12 వేలు పెంచబడిందని,రెండు విడతలుగా 6000 రూ.లు చొప్పున డి.బి. టి పద్ధతి లో సాయం అందించటం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా నుండి తొలగించాలని అన్నారు.
ఇళ్లు లేదా కాలనీ లుగా మారిన అన్ని రకాల భూములు,రియల్ ఎస్టేట్ లే అవుట్ లు,రోడ్లుగా మారిన భూములు,పరిశ్రమలకు, గోదాం లకు,మైనింగ్ కు వినియోగిస్తున్న భూములు,ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు,రాళ్ళు, రప్పలు,గుట్టలతో ఉండి సాగుకు అనువుగా లేని భూములు వ్యవసాయ యోగ్యం కాని భూములుగా గుర్తించాలని అన్నారు.ఇందుకు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ,డి. టీ.సి.పి లేఅవుట్‌లు,పెండింగ్ లే అవుట్ లు పరిశీలించాలని అన్నారు.వ్యవసాయ యోగ్యమైన భూములు గుర్తించేందుకు రెవెన్యూ ఇన్స్పెక్టర్,మండల వ్యవసాయ విస్తరణ అధికారి టీమ్ గా వ్యవహరిస్తారు.తహశీల్దార్,మండల వ్యవసాయ అధికారి బాధ్యత వహిస్తారని అన్నారు

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా**

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి రెండు విడతలుగా (ఒక్కో విడత రూపాయల 6000 చొప్పున) సంవత్సరానికి 12 వేలు ఇవ్వడం జరుగుతుందని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్న భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలై ఉండి, ఉపాధి హామీ పథకం కింద 2023 -2024 సంవత్సరానికి కనీసం 20 రోజులైనా పనిచేసిన వారు ఈ పథకానికి అర్హులని అన్నారు

**కొత్త రేషన్ కార్డులు**

కుల గణన సర్వే ఆధారంగా తయారుచేసిన రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితా క్షేత్రస్థాయి పరిశీలనకు మండల స్థాయిలో ఎంపీడీవోలు పట్టణ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు ప్రక్రియకు బాధ్యులని, ఆ తర్వాత జిల్లాస్థాయిలో కలెక్టర్ (రెవెన్యూ అదనపు కలెక్టర్), జిల్లా సివిల్ సప్లై అధికారి పర్యవేక్షకులుగా ఉంటారని తెలిపారు. ముసాయిదా జాబితాను గ్రామసభ/ వార్డు సభలో ప్రదర్శించి చర్చించిన తర్వాత ఆమోదిస్తారని, ఆమోదించిన లబ్ధిదారుల జాబితాను మండల /మున్సిపల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్ లో నమోదు చేసి జిల్లా కలెక్టర్ కు పంపించాల్సి ఉంటుందన్నారు. ఆ జాబితా ను కలెక్టర్/ పరిశీలించి సంతృప్తి చెందితే సీసీఎస్ లాగిన్ కు పంపుతారని, ఫైనల్ లిస్ట్ ప్రకారం సిసిఎస్ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారని ఆయన తెలిపారు.

**ఇందిరమ్మ ఇండ్లు**

ప్రజాపాలన లో దరఖాస్తు చేసుకున్న వారిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, ఇంటి నిర్మాణ స్థలం కలిగి ఉన్నవారు, అద్దె నివాసంలో ఉండేవారు అర్హులని, ఆర్ సి సి, ఇటుక గోడలు లేకుండా రేకుల షెడ్డు, గుడిసెలు ఉన్నవారికి, యువ వితంతువులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, పారిశుద్ధ కార్మికులు, వికలాంగులకు ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే అర్హులైన సొంత స్థలాలు లేని వాళ్ళకు కూడా ఇండ్లు కేటాయించబడతాయనిఅన్నారు.ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయాలనీ , ఈ నెల 16 నుండి 20 వరకు జాబితా ప్రదర్శన, ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలలో చదివి ఆమోదం పొందాలని అన్నారు.లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని,అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని ఆదేశించారు.
బ్రేక్ ఫాస్ట్ ఏర్పాటు చేయడం లో ఏమైనా సమస్యలు ఉన్నాయా, మండలం వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విదంగా విద్యార్థులచే ఎలాంటి స్వాగత కార్యక్రమాలు నిర్వహించరాదనీ దానికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లా లో ఉండే పాఠశాలలకు ఎవరొచ్చిన విద్యార్థులను దారికి ఇరువైపులా నిలబెట్టడం, చప్పట్లు కొట్టించడం, స్వాగతం పలికించడం, ఎలాంటి స్వాగత కార్యక్రమాలు నిర్వహించరాదనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ లు సుధీర్ , అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డి ఆర్ డి ఎ శ్రీనివాస్, విద్యా ది కారి రేణుక దేవి,ఎస్సి, ఎస్టీ, బి సి, మైనార్టీ సంక్షేమ అధికారులు ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.